

20న జిల్లా కేంద్రానికి రవాణా శాఖ మంత్రి

పార్వతీపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాకు శుక్రవారం రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి రానున్నారు. ఈ నెల 20న సాయంత్రం ఆయన పార్వతీపురం చేరుకోనున్నారు. ఆ రోజు రాత్రి పట్టణంలోనే బస చేయనున్నారు. 21న పార్వతీపురం ఆర్టీసీ డిపోను పరిశీలిం చనున్నారు. అనంతరం కొన్ని రూట్లకు సంబంధించి కొత్తగా బస్సు సర్వీసులను ప్రారంభిం చనున్నారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత జిల్లా నుంచి బయల్దేర నున్నారు. మంత్రి రాక నేపథ్యంలో సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం?

- సీతంపేట మన్యంలో వైద్య సిబ్బంది అలసత్వం
- గిరిజన గర్భిణులకు రక్షణ కరువు
- ప్రసవాలకు ఇబ్బందులు
- గాలిలో దీపాల్లా తల్లీబిడ్డల ప్రాణాలు
- చోద్యం చూస్తున్న వైద్యశాఖ

సీతంపేట రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంటే.. క్షేత్ర స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గిరిజన గర్భిణులకు రక్షణ కరువవుతోంది. వారి ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నాయి. వాస్తవంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణులకు ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రసవాల సమయంలో వారిని దగ్గరుండి మరీ పెద్దాసుపత్రిలో చేర్పించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి వైద్య సిబ్బందిపై ఉంది. అయితే గ్రామస్థాయిలో కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రసవాల సమయాల్లో గిరిజన గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు. పురిటి నొప్పులతో బాధపడుతున్న వారిని కుటుంబ సభ్యులు ఉరుకులు పరుగుల మీద ఆసుపత్రులకు చేర్పించే లోపు మార్గ మాధ్యంలో, 108 వాహనాల్లో డెలివరీ అవుతున్నారు. మరి కొందరు అవగాహన లేమి కారణంగా ఇళ్ల వద్దే ప్రసవించి ఇబ్బందులను కొని తెచ్చుకుంటున్నారు. ఏజెన్సీలో తరచూ జరిగే ఇటువంటి సంఘటనలు కొన్ని వెలుగు చూస్తుంటే, మరికొన్ని బయటకు రావడం లేదు.

వరుస ఘటనలు..

- నవంబరు 3న సీతంపేట ఏజెన్సీలో అంటికొండ పెద్దగూడ గ్రామంలో సవర చిన్నమ్మి అనే గిరిజన మహిళ ఇంటి వద్దే ప్రసవించింది. ప్రసవ అనంతరం తల్లీబిడ్డలను సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు.
- గత నెల 18న గోరపాడు గ్రామానికి చెందిన సవర జానకి అనే గర్భిణీని 108 వాహన సాయంతో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో వాహనంలోనే ప్రసవించింది.
- ఈ నెల 15న అంటికొండ పెద్దగూడకు చెందిన సవర సంధ్యారాణి అనే గర్భిణీని 108 వాహనంలో సీతంపేటఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది వైద్యసేవలు అందించడంతో తల్లీబిడ్డ ప్రాణాలతో బయటపడ్డారు.
- తాజాగా బుధవారం నారాయణగూడ గ్రామానికి చెందిన సవర లక్ష్మి అనే గిరిజన గర్భిణీని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మండ దీసరగూడ గ్రామ సమీపంలోకి వచ్చే సరికి 108 వాహనంలో ప్రసవించింది.

పర్యవేక్షణ లేక...

గ్రామస్థాయిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది పర్యవేక్షణలోపం.. గిరిజన గర్భిణులకు శాపంగా మారింది. వాస్తవంగా ఆయా పీహెచ్‌సీల పరిధిలోని గిరిజన గర్భిణుల వివరాలు ఏఎన్‌ఎం సబ్ సెంటర్‌లో నమోదై ఉంటాయి. వాటి ఆధారంగా గర్భిణులను ప్రతినెలా గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలు ఆయా పీహెచ్‌సీలకు తీసుకువెళ్లి వైద్యాధికారుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రసవ సమయం వరకు తరుచూ వైద్యాధికారుల పర్యవేక్షణలో సేవలు అందించాల్సి ఉంది. రక్తహీనతతో బాధపడుతున్న వారు ఐరన్ క్యాప్సిల్స్, పౌష్టికాహారం తీసుకునేలా చూడాల్సి ఉంది. ఈడీడీ (ఎక్స్‌పెక్ట్ డేటు ఆఫ్ డెలివరీ) ప్రకారం ముందుస్తుగా గిరిజన గర్భిణులను ఆశ, ఏఎన్‌ఎంలు ఏరియా ఆసుపత్రుల్లోని బర్త్ వెయిటింగ్ హోమ్స్‌లో చేర్పించాల్సి ఉంది. కానీ సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో అలా జరగడం లేదు. దీంతో నెల రోజుల వ్యవధిలో ముగ్గురు గిరిజన గర్భిణులు 108 వాహనంలో ప్రసవించారు. ఇంకొందరు ఇంటి వద్దే ప్రసవమవుతున్నారు. ఆశ వర్కర్లు సేవలు అందిస్తున్నప్పటికీ ముందస్తుగా గిరిజన గర్భిణులను ఆసుపత్రుల్లో చేర్చకపోవడం వల్ల ఇటువంటి సంఘటనలు తరుచూ పునరావృతమవుతున్నాయి.

ఏరియా ఆసుపత్రిలో బర్త్ వెయిటింగ్ హోం

గిరిజన గర్భిణుల కోసం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేకంగా నాలుగు గదుల్లో నాలుగు బెడ్లతో బర్త్ వెయిటింగ్ హోమ్ అందుబాటులో ఉంది. అయినా వాటిని గిరిజనులు వినియోగించు కోలేకపోతున్నారు. గిరిజన గర్భిణులు ఏ నెలలో ప్రసవిస్తుందో ఈడీడీ (ఎక్స్‌పెక్ట్ డేటు ఆఫ్ డెలివరీ) టెస్ట్ ద్వారా తెలుస్తుంది. దీనికి అనుగుణంగా గ్రామస్థాయిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సంబంధిత గర్భిణులను ప్రసవం కోసం ఆ తేదీలకు ముందు ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సి ఉంది. అయితే సీతంపేట మన్యంలో ఈ విధంగా జరగడం లేదు.



వైటీసీలో ఐటీడీఏ ఏర్పాటు చేసిన గర్భిణుల వసతిగృహం

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు

కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే మాతా శిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టింది. ఈమేరకు గిరిజన గర్భిణుల రక్షణ కోసం సీతంపేట ఐటీడీఏ పరిధిలోని వైటీసీ కేంద్రంగా వసతిగృహాన్ని ఏర్పాటు చేసింది. హైరిస్క్ గర్భిణులను ఇక్కడ ముందస్తుగా చేర్చుకొని పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రసవ సమయానికి ఒక రోజు ముందు వారిని సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో వారి ఇంటికి చేర్చుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరులో ప్రారంభించిన ఈ వసతి గృహం ద్వారా నేటికి సుమారు వందమంది గిరిజన గర్భిణులు సేవలు పొందారు. ప్రస్తుతం తల్లీబిడ్డలంతా ఆరోగ్యంగా ఉన్నారు.



ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఏమన్నారంటే...


'ఏజెన్సీ ప్రాంతాల్లో మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఈ మేరకు వైద్య సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ప్రసవాల కోసం ముందుగానే గిరిజన గర్భిణులను ఆసుపత్రుల్లో చేర్పించాలని సూచించాం. అయితే గిరిజన ప్రాంతాల్లో కొంతమందిలో అవగాహన లోపం కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయి.' ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి తెలిపారు.

రేపు డిప్యూటీ సీఎం రాక!

- సాలూరు లేదా కురుపాం వచ్చే అవకాశం
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- ఉప ముఖ్యమంత్రి పవన్ పర్యటనను అధికారికంగా ప్రకటించని జిల్లా యంత్రాంగం



సిరివర రోడ్డు నిర్మాణ విషయమై వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్



సాలూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాలూరు లేదా కురుపాం ఏజెన్సీకి ఈ నెల 20న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రానున్నట్లు తెలిసింది. ముందస్తు సమాచారం మేరకు ఇప్పటికే జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవంగా కొద్దిరోజుల కిందట కురుపాం ఏజెన్సీలో పవన్ కల్యాణ్ పర్యటించాల్సి ఉండగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాకతో చివరి నిమిషంలో పర్యటన రద్దు అయ్యింది. అయితే తాజాగా డిప్యూటీ సీఎం మన్యం జిల్లా పర్యటన ఖరారైనట్లు సమాచారం. గురువారం రాత్రి భోగాపురం మండలానికి ఆయన చేరుకొని అక్కడే రాత్రి బస చేయనున్నారు. మరసటిరోజు 20న వాతావరణ పరిస్థితిని బట్టి అక్కడ నుంచి కురుపాం లేదా సాలూరు మండలానికి వెళ్లనున్నట్లు తెలిసింది. అయితే డిప్యూటీ సీఎం పర్యటన విషయాన్ని ఇప్పటివరకు వారు అధికారంగా ప్రకటించలేదు. మరోవైపు సాలూరు మండలం సిరివర, తదితర గిరిశిఖర గ్రామాలకు సంబంధించి రోడ్డు నిర్మాణ శంకుస్థాపనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, ఐటీడీఏ ఈఈ మణిరాజ్, డీఈఈ సంతోష్ కుమార్ పట్నాయక్ తదితరులు గురువారం సాయంత్రం ఆ ప్రాంతంలో పర్యటించారు. బాగుజోల నుంచి సిరివర రోడ్డు నిర్మాణ స్థలం, శంకుస్థాపన చేసే బాగుజోల ప్రదేశాన్ని వారు పరిశీలించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాక సమాచారంతో సాలూరు, కురుపాం మండల అధికారులు పూర్తి వివరాలతో సన్నద్ధమవుతున్నారు.

20 నుంచి పీసా ఎన్నికలు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలంలో 41 పంచాయతీల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పీసా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రశాంతంగా ఎన్ని కలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 102 గ్రామసభల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శి ఎన్నిక జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ సమా వేశంలో ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ అప్పలరాజు పాల్గొన్నారు.



పీసా ఎన్నికలపై సూచనలిస్తున్న ఇన్‌చార్జి పీవో

కళాకారుల కార్ఖానా

- నిత్యాభ్యాసం చేస్తున్న ఔత్సాహికులు
- రాష్ట్రవ్యాప్తంగా నాటక ప్రదర్శనలు
- పౌరాణిక పాత్రధారణలతో మంచి గుర్తింపు
- ప్రత్యేకత చాటుతున్న రామ్మూర్తినాయుడు కళాకారుల సంఘం

6లో



అనర్హులకు చెక్?

- దివ్యాంగ పింఛన్ల తనిఖీలు
- త్వరలో వైద్య బృందాల రాక
- వారి నివేదికలే ఫైనల్
- అర్హులకు అండగా నిలిచేందుకే..

6లో

అన్నదాతలు బెంబేలు

- కోసిన పంట పొలాల్లోనే..
- నూర్పులపై వర్షాల ప్రభావం
- పంట సంరక్షణలో బిజీబిజీ

6లో



సఫాయి కర్మచారీలకు పునరావాసం కల్పించాలి

- జాతీయ కమిషన్ సభ్యుడు వావా

పార్వతీపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సఫాయి కర్మచారీలకు పునరావాసం కల్పించాలని జాతీయ కమిషన్ సభ్యుడు పీవీ వావా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ పథకాలు వర్తింపు చేయాలన్నారు. బ్యాంకు రుణాలకు సంబంధించి వారికి ష్యూరిటీ అవసరం లేదన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశువులు, కోళ్ల తదితర పెంపకం యూనిట్లు మంజూరు చేయొచ్చని తెలిపారు. ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణిస్తే తక్షణమే కుటుంబ సభ్యులకు ఉద్యోగాన్ని కల్పించాలని ఆదేశించారు. కార్మికులకు అవసరమైన దుస్తులు, బూట్లు, చేతిగ్లౌజ్‌లు, నూనె తదితర సామగ్రిని అందించాలన్నారు. అనంతరం కర్మచారీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. అంతకుముందు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వావాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సమావేశంలో జేసీ శోభిక, ఏఎస్పీ దిలీప్‌కిరణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కమిషన్ సభ్యుడు వావా

చిట్టితల్లికి ఎన్ని కష్టాలో!

- ఉమ్మడి జిల్లాలో ఆగని బాల్య వివాహాలు
- భారంగా పరిగణిస్తున్న తల్లిదండ్రులు
- కుటుంబ కారణాలతో బాల్యంలోనే పెళ్లిళ్లు
- పర్యవసానంగా శారీరక రుగ్మతలు, కష్టాలు



6లో

కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పాచిపెంట మండలం శతాబి వద్ద కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పొలం గట్లుపై ఆదాయం సమకూరే అంతర పంటలు వేయాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కూరగాయల విత్తనాలను రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. జనవరి నుంచి రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రతి మండలంలో డ్రోన్ దీదీలను గుర్తించాలని తెలిపారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేజ్ కల్చర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో ప్రసూన, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, పశుసంవర్ధక శాఖాధికారి ఎస్.మన్మథరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు తదితరులున్నారు.

స్థానికంగానే అర్జీలు పరిష్కరించాలి

మండల స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను స్థానికంగానే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం కావాలన్నారు. గృహ నిర్మాణంలో పనితీరు ఆధారంగా అధికారులకు గ్రేడ్‌లు ఇవ్వాలని ఆదేశించారు. జియ్యమ్మవలస మండలంలో పీఎం జన్‌మాన్‌లో పురోగతి లేకపోవడంపై ప్రశ్నించారు. ప్రతి నెలా కనీసం ఐదు వందల ఇళ్లు పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు.

గిరిశిఖర గ్రామాలు పరిశీలన

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన రాక నేపథ్యంలో సిరివర, బాగుజోల, చిలకమెండంగి గిరిజన శిఖర గ్రామాల్లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవ రెడ్డి పర్యటించారు. బందో బస్తు ఏర్పాట్లను మ్యాప్ ఆధారంగా పరిశీలించారు. గిరిజనులతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాలూరు సీఐ రామకృష్ణ, మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలమాంబ జాతర పనులు వేగవంతం

మక్కువ: వచ్చే ఏడాది జనవరి 27, 28, 29 తేదీల్లో జరగనున్న శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం శంబర గ్రామాన్ని సందర్శించారు. చదురుగుడి, వనంగుడి పరిసరాల్లో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. చదురుగుడి వెనుక స్థలంలో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



బాగుజోల గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

చిట్టితల్లికి ఎన్ని కష్టాలో!



- జిల్లాలో ఆగని బాల్య వివాహాలు
- భారంగా పరిగణిస్తున్న తల్లిదండ్రులు
- కుటుంబ కారణాలతో బాల్యంలోనే పెళ్లిళ్లు
- పర్యవసానంగా శారీరక రుగ్మతలు, కష్టాలు





రాజాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు.. రెండు కాదు.. జిల్లాలో వందల సంఖ్యలో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. అయితే వెలుగులోకి వచ్చినవి కొన్నే. ఈవిషయం ఆందోళన కలిగిస్తోంది. విజయనగరం ఘోషా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రతి 100 మంది గర్భిణీల్లో 30 మంది బాల్య వివాహాలు చేసుకున్నవారే. ఇది నమ్మశక్యంకాని నిజం. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేదని, తల్లిదండ్రుల అనారోగ్యం పేరు చెప్పి చదువుకోవాల్సిన వయసులో వారిని పెళ్లిపీటలు ఎక్కిస్తున్నారు. కాదని ఎదిరిస్తే కుటుంబ కారణాలు చెప్పి గొంతునొక్కేస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు, పేదరికం, పరువు, అనాలోచిత నిర్ణయాలు.. ఇలా రకరకాల కారణాలతో తల్లిదండ్రులు పెళ్లి వయసురాక మునుపే బాలికలను వైవాహిక జీవితంలోకి నెడుతున్నారు. వారి నిండు జీవితాన్ని చేజేతులా చిదిమేస్తున్నారు. చిన్నతనంలోనే సంసార బాధ్యతలు, పిల్లల జననం, పెంపకం వంటి భారాలు మోయలేక శారీరకంగా, మానసికంగా వారు కుంగి అనారోగ్యం పాలవుతున్నారు. ఫలితంగా గొడవలు, పెద్దల పంచాయితీలు నడుస్తున్నాయి. కొందరు విసుగు చెంది విడాకులు తీసుకుంటున్నారు. మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

కొన్నే వెలుగులోకి..

గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది నవంబరు వరకూ జిల్లాలో 95 బాల్య వివాహాలను అడ్డుకుంటున్నట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. 2020 నుంచి 2024 మధ్య 228 బాల్య వివాహాలు వారు అడ్డుకున్నట్టు సమాచారం. అనధికారిక లెక్కల మేరకు ఎన్నో వివాహాలు జరిగి ఉంటాయనేది వాస్తవం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయి. కొన్ని సామాజిక వర్గాల్లో ఇప్పటికీ కట్టుబాట్ల రూపంలో బాల్య వివాహాలను ప్రోత్సహిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. వాస్తవానికి అబ్బాయికి 21 ఏళ్లు, అమ్మాయికి 18 ఏళ్లు నిండితేనే వివాహాలు చేయాలి. ఆ వయసు లోపల చేస్తే అవి కచ్చితంగా బాల్య వివాహాలే. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. పెళ్లి జరిపించినా.. అందులో పాల్గొన్న రెండేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల వరకూ జరిమానా ఉంటుంది.

నిరక్షరాస్యతే ప్రధాన కారణం..

ఆడపిల్లల్లో రుతుక్రమం ప్రారంభం కాగానే వారికి పెళ్లి చేయాలన్న ఆలోచన నాటుకుపోయింది. వయసు పెరిగే కొలదీ వారికి వివాహం జరగదన్న ఆందోళన కూడా వారిని వెంటాడుతుంటుంది. త్వరగా పెళ్లి చేస్తే తమ బరువు, బాధ్యత తీరిపోతుందని ఎక్కువ మంది భావిస్తుంటారు. అయితే చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే అనేక రుగ్మతలు, అనారోగ్య సమస్యలు జీవితాంతం వేధిస్తాయనేది వైద్య నిపుణుల మాట. 18 సంవత్సరాల్లోపు బాలిక గర్భం దాల్చితే ప్రాణాలకే ప్రమాదం. శరీర వికాసం ఉండదు. తల్లికే కాదు.. పుట్టబోయే బిడ్డ ప్రాణాలకు ముప్పు ఉంటుంది. పుట్టే బిడ్డ తక్కువ బరువు, ఇన్‌ఫెక్షన్, కామెర్లు వంటి రుగ్మతలు వెంటాడుతాయి. బిడ్డ ఎదుగుదల పైనా ప్రభావం పడుతుంది.

నియంత్రణకు కృషిచేస్తున్నా..

ఐసీడీఎస్, ఆరోగ్యం, విద్య, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, మెప్మా.. ఇలా అన్ని శాఖలపై బాల్య వివాహాల నియంత్రణ బాధ్యత ఉంది. కొన్ని స్వచ్ఛంద సేవాసంస్థలు సైతం నియంత్రణకు కృషి చేస్తున్నాయి. అయితే పలు శాఖల అధికారులు తూతూమంత్రంగా అవగాహన సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పాఠశాల, జూనియర్ కాలేజీ స్థాయిలో బాలికలకు వివాహాలు జరుగుతున్నా, సంబంధిత యాజమాన్యాలు సైతం ఆరా తీయడం లేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయడం లేదు.

అత్యంత ప్రమాదకరం..

బాల్య వివాహాలు అత్యంత ప్రమాదకరం. ఎక్కువగా గైనిక్ సమస్యలు వస్తుంటాయి. ఆస్పత్రికి ఆరోగ్య సమస్యలపై వచ్చిన మహిళల్లో ఎక్కువ మంది బాల్య వివాహితులే. ప్రసవించిన తరువాత తల్లితో పాటు బిడ్డకూ అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. అందుకే తల్లిదండ్రులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. వేగంగా వివాహం చేసి వారి బరువును తగ్గించుకున్నామని భావిస్తున్నారే కానీ.. వారు ప్రమాదంలో పెట్టేస్తున్నామన్న విషయాన్ని గుర్తించడం లేదు.

-యడ్ల నీరజారాణి, గైనకాలజిస్టు, రాజాం

నియంత్రిస్తున్నాం..

పోలీసులు, స్వచ్ఛంద సంస్థల సాయంతో బాల్య వివాహాలను నియంత్రిస్తున్నాం. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్‌లైన్ ప్రతినిధులకు సమాచారం అందించాలి. 1098, 112 నంబర్లకు ఫోన్ చేయాలి. ఈ విషయం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. అన్ని శాఖల సహకారంతో బాల్య వివాహాలను నియంత్రించగలుగుతున్నాం.

-శాంతకుమారి, ఐసీడీఎస్ పీవో, విజయనగరం

అనర్హులకు చెక్?

- దివ్యాంగ పింఛన్ల తనిఖీలు
- త్వరలో వైద్య బృందాల రాక
- వారి నివేదికలే ఫైనల్
- అర్హులకు అండగా నిలిచేందుకే..



మెంటాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లలో ఎక్కువగా అనర్హులు ఉన్నట్టు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. ఈ విషయంలో మరింత లోతుగా వెళ్లేందుకు నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే విధివిధానాలు రూపొందించిన ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే కార్యాచరణకు సిద్ధం కానుంది.

బోగస్ పెన్షనర్ల భరతం పట్టేందుకు నిర్ణయించిన ప్రభుత్వం ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ఓ గ్రామ/వార్డు సచివాలయం చొప్పున ఎంపిక చేసి పల్స్ సర్వే నిర్వహించింది. ఒక్కరోజులో సుమారు 11 వేల పింఛన్లు తనిఖీ చేయగా, వాటిలో 563 మంది అనర్హులుగా గుర్తించినట్లు సమాచారం. సర్వే మరింత లోతుగా నిర్వహిస్తే త్వరలో జిల్లాల వారీగా వైద్య బృందాలను రంగంలోకి దింపనుంది. వీరు కేటాయించిన సచివాలయాల పరిధిలోని దివ్యాంగుల పింఛన్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనర్హుల నిగ్గు తేల్చనున్నారు. ఈక్రమంలో అర్హులకు అండగా నిలవాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

నకిలీ సర్టిఫికెట్లతో..

నకిలీ సదరం సర్టిఫికెట్ల గుట్టు బట్టబయలు అయ్యే అవకాశం ఉంది. అటువంటి సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులనూ ప్రాసిక్యూట్ చేయాలని ప్రభుత్వం ఇటీవల కలెక్టర్ల సదస్సులో సూచనప్రాయంగా వెల్లడించింది. దానికి అనుగుణంగా వైద్యులతో తనిఖీ చేయించాలని తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. వైద్య బృందాలు తనిఖీకి సంబంధించి రూపొందించిన విధివిధానాలను ఆమోదించిన వెంటనే ఆయా బృందాలు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగనున్నాయి. బోగస్ పింఛన్ల ఏరివేత లక్ష్యంగా ఒక్కో అడుగు వేస్తున్న ప్రభుత్వం.. వైద్య బృందాలను రంగంలోకి దింపనుండటం కచ్చితంగా ముల్లును ముల్లుతోనే తీసే సూత్రం అవలంభించడమే. దీంతో అనర్హులతో పాటు తప్పుడు సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యుల్లోనూ కలకలం మొదలైంది.

పైడిరాజుకు పసిడి పతకాలు

- మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రాణింపు

సాలూరు రూరల్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో మండలంలోని మామిడిపల్లికి చెందిన మహిళ కనకల పైడిరాజు నాలుగు బంగారు పతకాలు సాధించారు. రెండు రోజుల కిందట కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఆమె పాల్గొన్నారు. 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 100 మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. వరుసగా నాలుగు పతకాలను పైడిరాజు సాధించడం విశేషం. ఇటీవల శ్రీలంక, మలేషియాల్లో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో సైతం ఆమె పతకాలు సాధించిన విషయం విధితమే. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొని పలు పతకాలు సాధించారు. కోచ్ పొట్నూరు శ్రీరాములు గైడెన్స్, తన భర్త గణపతి స్ఫూర్తితో విజయం సాధిస్తున్నానని ఆమె తెలిపారు. ప్రస్తుతం విశాఖ గీతం డెంటల్ కాలేజీలో ఏఎన్ఎంగా ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఆమెకు బంగారు పతకాలు సాధించడంపై మామిడిపల్లి వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధం చేస్తామని కోచ్ శ్రీరాములు తెలిపారు.



బంగారు పతకం, ప్రశంస పత్రం అందుకుంటున్న పైడిరాజు

కళాకారుల కార్ఖానా



- నిత్యాభ్యాసం చేస్తున్న ఔత్సాహికులు
- రాష్ట్రవ్యాప్తంగా నాటక ప్రదర్శనలు
- పౌరాణిక పాత్రధారణలతో మంచి గుర్తింపు
- ప్రత్యేకత చాటుతున్న రామ్మూర్తినాయుడు కళాకారుల సంఘం

వీరఘట్టం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని శ్రీకోడిరామ్మూర్తి నాయుడు రంగస్థల కళాకారుల సంఘం ఔత్సాహిక కళాకారులకు కార్ఖానాగా నిలిచింది. స్థానిక కళాకారుల కోసం కిమిడి వెంకటరావు రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో రూ.2 లక్షలు మంజూరు చేశారు. దాంతో రంగస్థల కళాకారుల సంఘానికి సొంత భవనం సమకూరింది. ఇక్కడకు వీరఘట్టం మండలంతో పాటు వంగర, జియ్యమ్మవలస, పాలకొండ, గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ మండలాల నుంచి వందలాది మంది కళాకారులు రోజూ వచ్చి వారికి నచ్చిన పౌరాణిక పాత్రలోని పద్యాలను వల్లె వేస్తుంటారు. నటనలో మెలకువల శిక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు.



వీరఘట్టంలోని రంగస్థల కళాకారుల భవనం

ప్రశంసల వెల్లువ..

రామ్మూర్తినాయుడు రంగస్థల కళాకారుల సంఘంలో నటనాభ్యాసం చేసిన ఎంతో మంది రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో నాటక ప్రదర్శనలు ఇచ్చారు. బహుమతులు, ప్రశంసలు అందుకుంటున్నారు. సత్యహరిశ్చంద్ర, కురుక్షేత్రం తదితర పౌరాణిక నాటకాల్లో ప్రధాన పాత్రలతో ఎందరినో మెప్పించి మంచి గుర్తింపు పొందారు. సుమారు 20 ఏళ్లుగా ఎంతో మంది కళాకారులు తమ ప్రతిభకు మరింత పదునుపెట్టి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.



శిక్షణలో కళాకారులు

రోజూ వంద మంది వరకూ..



మండలంతో పాటు సమీప మండలాల్లోని కళాకారులు ప్రతిరోజూ వంద మంది వరకూ ఇక్కడకు వస్తుంటారు. పౌరాణిక పాత్రల పద్యాలను సాధన చేస్తారు. నాతో పాటు ఎంతో మంది కళాకారులు మంచి గుర్తింపు పొందారు.

-రౌతు రామకృష్ణంనాయుడు (విశ్వామిత్ర-పాత్రధారి)

మంచి గుర్తింపు నిచ్చింది..



రామ్మూర్తినాయుడు రంగస్థలం కళాకారుల సంఘంలో సభ్యుడిగా ఉంటూ నక్షత్రకుడు పాత్రలో శిక్షణ పొందాను. ఈ పాత్ర నాకు మంచి గుర్తింపునిచ్చింది. నాటకాల పోటీల్లో పరిషత్ విన్నర్‌గా నిలిచాను.

-కొద్దిగాన భాస్కరరావు, (నక్షత్రకుడు-పాత్రధారి), తూడి గ్రామం

ఖాళీ సమయాల్లో వస్తుంటాను..



మా గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ ఖాళీ సమయంలో ఇక్కడకు వచ్చి హరిశ్చంద్ర పాత్రకు సంబంధించిన పద్యాలను ప్రాక్టీస్ చేస్తుంటారు. నాలాంటి ఎంతో మంది కళాకారులకు రామ్మూర్తినాయుడు రంగస్థల కళాకారుల సంఘం ఉపయుక్తంగా ఉంటోంది.

-ఆలుబిల్లి జయశంకరరావు, (హరిశ్చంద్ర-పాత్రధారి), దశమంతుపురం

అన్నదాతలు బెంబేలు

- కోసిన పంట పొలాల్లోనే..
- నూర్పులపై వర్షాల ప్రభావం
- పంట సంరక్షణలో బిజీబిజీ



సంతకవిటి: పరదాలు కప్పి ధాన్యం తరలింపు

సాలూరు రూరల్/వంగర/వీరఘట్టం/భామిని/గరుగుబిల్లి/సంతకవిటి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, మబ్బుల వాతావరణం లోతట్టు ప్రాంతాల్లో కర్షకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత కొద్దిరోజులు కోతలు, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది సాలూరు మండలంలో 7562 ఎకరాల్లో వరి సాగయ్యింది. ఈ తరుణంలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. పంట రక్షణకు పడరాని పాట్లు పడుతున్నారు. వంగర మండలంలో 8 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా సుమారు 75 శాతం ధాన్యం విక్రయాలు పూర్తిచేశారు. ఆలస్యంగా నాట్లు వేసిన పంటలు ఇప్పుడే కోతకు వచ్చాయి. పొలాల్లోనే పంట ఉంది. దాంతో ఆ ధాన్యాన్ని వర్షాల నుంచి కాపాడుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. భామిని మండలంలో గురండి, నులకజోడు, సింగిడి, భామిని, దిమ్మిడిజోల తదితర గ్రామాల్లో నిల్వ ఉంచిన ధాన్యానికి టార్పన్లు కప్పారు. అలాగే పత్తి పంటను ఆదరాబాదరాగా విక్రయాలు చేపడుతున్నారు. వీరఘట్టం, గరుగుబిల్లి, పాలకొండ మండలాల్లో రైతులూ ఆందోళన చెందుతున్నారు. మబ్బులు, చినుకులతో అన్నదాతలు బెంబేలెత్తుతున్నారు.



భామిని: నులకజోడులో ధాన్యంపై టార్పన్లు కప్పుతున్న రైతులు





సాలూరు రూరల్: పొలంలో ఉన్న వరి పనలు, కొనుగోలు కేంద్రానికి తరలించడానికి సిద్ధం చేసిన ధాన్యం



పాలకొండ: నడుకూరులో వరి కుప్పలపై టార్పన్లు



గరుగుబిల్లిలో ధాన్యం నిల్వలపై టార్పాలిన్లు



వంగర: ధాన్యం బస్తాలపై పరదాలు కప్పిన దృశ్యం

న్యూస్ బాక్స్

22న క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభం

కొత్తవలస, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళపాలెం గ్రామంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రిని ఈ నెల 22న ప్రారంభిస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో రోగులకు ఉచిత వైద్య సాయం అందిస్తామని తెలిపారు.

అవగాహన అవసరం

వేపాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం..పోషకాహారంపై మహిళలక అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.ఆనందరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఆకులసీతంపేట, వీలుపర్తి గ్రామాల ఆరోగ్య మహిళా సభ్యులకు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రామ్మోహన్ జన్మదిన వేడుకలు

లక్కవరపుకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జన్మదినాన్ని ఎమ్మెల్యే లలితకుమారి నివాసం వద్ద ఘనంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లలితకుమారి, నేతలు కోళ్ల రాంప్రసాద్, చొక్కాకుల మల్లునాయుడు, కోళ్ల భూపాల్‌నాయుడ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

సంతకవిటి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వై.మణికుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.మోహన్‌రావు, పి.కృష్ణ, సమాచార కార్యదర్శులుగా సవలాపురపు రామారావు, గడే రామారావు, ఎస్.మాధవి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నరేష్, సహాయ కార్యదర్శులుగా మజ్జి ధనలక్ష్మి, వి.శ్వేత, కోశాధికారిగా ఇ.శంకరరావు, కె.దిలీప్‌కుమార్, ఉప కోశాధికారిగా ఎ.అనూష, ఎస్. వేణు నాయుడులను ఎన్నుకున్నారు.

నేత్రదానం

చీపురుపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణానికి చెందిన విశ్రాంత వీడీఓ లంకలపల్లి ఆదిబాబు మరణానంతరం నేత్రం దానం చేశారు. ఆయన అనారోగ్యంతో బుధవారం మరణించారు. మృతుని కుటుంబ సభ్యులు, అల్లుడైన రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్, బీవీ గోవిందరాజులు అంగీకారం మేరకు ఆయన కార్నియాను సేకరించి, విశాఖపట్నంలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు.

కార్పొరేషన్‌కు అవార్డు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థకు ఏపీ రాష్ట్ర ఇంధన సంస్థ సిల్వర్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈనెల 20న విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య అవార్డును అందుకోనున్నారు.

రాజకీయ కోణం వద్దు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో రాజకీయ కోణం చూడడం సరికాదని రాష్ట్ర యాత, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ సేవా సంఘం ప్రతినిధులు చోడి ఆదినారాయణ, అప్పలరాజులు అన్నారు. బుధవారం కోట జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, చుక్కా గణేష్, పైడిరాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనం కేటాయించాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రాము, వెంకటేష్, చినబాబు, పాల్గొన్నారు..

వావాను కలిసిన కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటన నిమిత్తం వచ్చిన జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావాను బుధవారం కలెక్టరు అంబేడ్కర్ కలిశారు. జిల్లాలో వారి కోసం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలపై చర్చించారు.

సైబర్ క్రైంపై అప్రమత్తం

గరివిడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. గరివిడి పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైంపై ఎప్పటికప్పుడు పోలీసు యంత్రాంగం ప్రజలలో అవగాహన పెంపొందిస్తుందని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

నెల్లిమర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు పిలుపునిచ్చారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కావద్దని హితవు పలికారు.

భూ సమస్యలను పరిష్కరించండి:కలెక్టర్



రైతుల సమస్యలు వింటున్న కలెక్టర్ అంబేడ్కర్

గుర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలు ఎదుర్కొంటున్న భూసమస్యలపై దృష్టి సారించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఆదేశించారు. దేవుని కణపాకలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. గ్రామ ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్ పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు, రైతులు, గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. వాగులు, వంకలు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. గిరిజన రైతులు చాలా ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చి తమను హక్కుదారులను చేయాలని కోరారు. కొంత మందికి పట్టాలు ఉన్నప్పటికీ భూమిని అప్పగించలేదని కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఆ భూమికి సంబంధించిన వివరాలను ఆరా తీశారు. దీనిపై క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వారంలోగా నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఇద్దరు రైతుల పాసు పుస్తకాల సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించారు. ఈ సదస్సులో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఏవో తిరుపతిరావు, డిప్యూటీ తహసీల్దార్ పి.నారాయణమ్మ, సర్వేయర్ బి.శివ, ఆర్ఐ దుర్గాప్రసాద్, సర్పంచ్ సూర్య నారాయణ రాజు పాల్గొన్నారు.

హక్కుపత్రాలు ఇప్పించండి

రేగిడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ భూములకు హక్కుపత్రాలు రావటం లేదని, పాస్‌బుక్‌లో ఉన్నా వెబ్ ల్యాండ్‌లో పేరు లేక అడంగల్ రావటం లేదని సంకిలి, బొడ్డవలస రైతులు తహసీల్దారు చిన్నారావుకు తెలియజేశారు. సంకిలి, బొడ్డవలస గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో పలువురు రైతులకు గతంలో డీ పట్టాలు, పాస్‌బుక్‌లు జారీచేసినా వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాలేదని తెలిపారు. అధికశాతం జీరో ఎక్స్‌టెంట్‌లో కనిపిస్తున్నాయని, వీటిని సరిచేయాలని సంకిలి సర్పంచ్ బి.పట్టాభి, ఉపసర్పంచ్ జి.పకీరునాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు తదితరులు తహసీల్దారు దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రేవతి, డీటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించండి



అధికారులను అడ్డుకున్న మర్రివలస ప్రజలు

గజపతినగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మర్రివలస గ్రామానికి వెళ్లే రోడ్డు కనుమరుగైపోతోందని... అధికారులు స్పందించి రహదారి సదుపాయం కల్పించాలని గ్రామానికి చెందిన చల్లా అర్జునరావు, తవిటి నాయుడు తదితరులు బుధ వారం ఆందోళన చేపట్టారు. మర్రివలస మీదుగా నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే రావడంతో తమ గ్రామానికి పూర్వం నుంచి ఉన్న రోడ్డు కనుమరుగైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ఆనుకొని సిగడంవలస, పారావలస, రాయివలస, మల్లేడువలస, కొండరాబా గ్రామాలకు రోడ్డు మార్గం లేకుండా పోతుందని అన్నారు. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి దారి చూపించేంత వరకు పనులు చేపట్టనీయమని డిప్యూటీ మేనేజర్ కిరణ్‌తో పాటు ఇతర అధికారులను అడ్డుకున్నారు. రోడ్డు మంజూరు చేస్తేనే పనులు చేపట్టాలని భీష్మించారు. మట్టి రోడ్డు వేస్తామని అధికారులు హామి ఇచ్చినా ఒప్పుకోలేదు. సీసీ లేదా బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తులు పట్టుబట్టారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తవిటినాయుడు, దేముడు, సీతన్న, తిరుపతిరావు, ఎర్రినాయడు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి సైకిల్ యాత్ర

నెల్లిమర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఇద్దరు భవానీ దీక్షధారులు విజయవాడ కనకదుర్గ ఆలయానికి బుధవారం సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఒమ్మి గ్రామానికి చెందిన అంబళ్ల అప్పలనాయుడు, అలుగోలు గ్రామానికి చెందిన కోరాడ గోవర్దన్ సైకిళ్లపై అమ్మవారి దర్శనానికి వెళుతున్నారు.

రక్తదానం

నెల్లిమర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండగుంపాంలో బుధవారం ఆ గ్రామానికి చెందిన పతివాడ రాంబాబు ఆధ్వర్యంలో రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. 36 మంది యువకులు రక్తదానం చేశారు. మిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బంది రక్తం సేకరిం చారు. స్థానికులకు వైద్య పరీక్షలు చేసి..ఉచితంగా మందులు అందించారు.

సీఎం సహాయ నిధి సాయం అందజేత

గజపతినగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తబగ్గాంకు చెందిన లెంక ఈశ్వరరావుకి సీఎం సహయ నిధి చెక్కును బుధవారం పార్టీ నాయకులు అందజేశారు. ఈశ్వరరావు తీవ్ర అనా రోగ్యంతో బాధ పడుతున్నాడు. తనకు సాయం కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరగా ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.62,228 మంజూరు చేయించారు. ఈ చెక్‌ను మాజీ ఎంపీపీ కొండలరావు, మాజీ జెడ్పీటీసీ శ్రీధర్, గోపాలరాజు అందజేశారు.

గంట్యాడలో...

గంట్యాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కిర్తుబర్తి గ్రామానికి చెందిన రఘుమండ రమణ అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడటంతో ఆయనకు సీఎం సహాయ నిధి నుంచి రూ.2,11,827 బుధవారం అందించారు. మంత్రి శ్రీనివాస్‌కు రమణ సమస్యను వివరించడంతో ఆయన సీఎం దృష్టికి తీసుకుని వెళ్లారు. ఈ చెక్కును మాజీ ఎంపీపీ కొండలరావు ద్వారా రమణకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, నాయకులు రంధి చినరాము నాయుడు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేగిడిలో...

రేగిడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):బూరాడ గ్రామానికి చెందిన వి.సత్యంనాయుడుకు సీఎం సహాయ నిధి నుంచి రూ.2.31 లక్షల చెక్కును టీడీపీ నేత కోండ్రు జగదీష్ బుధవారం అందించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో ఈ సాయం అందింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగభూషణరావు, గులివిందల శ్రీనివాసరావు, కర్లేన మహేశ్వరరావు, పాలవలస రామచంద్రినాయుడు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

రాజాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో రోడ్లు, కాలువల నిర్మాణం పనులను కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. నాణ్యత లోపిస్తే ఫిర్యాదు చేయాలని కాలనీ వాసులకు సూచించారు.

పంచాయతీ సరిహద్దులు తేల్చండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

లక్కవరపుకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా తమ గ్రామ సరిహద్దుల సమస్య తీరలేదని, ఇప్పటికైనా పరిష్కారం చూపాలని కోరుతూ రంగరాయపురం గ్రామస్తులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తమ గ్రామ సరిహద్దును నిర్ధారించి రెవెన్యూ రాబడిని పంచాయతీకి వచ్చేటట్టు చూడాలని కోరుతూ గ్రామస్థులంతా మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు నేతృత్వంలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న భూముల అమ్మకాలు, కొనుగోలు విషయంలో చిక్కులు ఏర్పడుతున్నాయని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గతేడాది ఇదే సమస్యపై జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తే.. పరిష్కారమైనట్టు మెసేజ్ వచ్చిందని, తీరా చూస్తే కనీసం చూడనేలేదని తేలిందని మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే లలిత కుమారి... కలెక్టర్‌తో ఈ సమస్యపై మాట్లాడుతానని, పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాదరావు, పాల్గొన్నారు.

కొలిక్కిరాని సంత వివాదం



విచారణలో పాల్గొన్న డీఎల్‌పీవో మోహనరావు

జామి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అలమండ (లొట్లపల్లి)పశువుల సంత లైసెన్స్ రెన్యూవల్ విషయమై పంచాయితీ తేలడం లేదు. తాజాగా జరిగిన సమావేశంలో అధికారులపై నిర్వాహకుడి ప్రతినిధి (ఏజెంట్) విరుచుకుపడ్డాడు. ఏడాది కాలంగా అనుమతులు లేకపోయినా ప్రతి సోమవారం ఈ సంత కొనసాగుతోంది. దీని లైసెన్స్ రెన్యూవల్ చేసేందుకు గడిచిన ఆరునెలలుగా అధికారులు సమావేశం ఏర్పాటు చేస్తున్నా.. ఈ సంత కమిటీలోని అధికారులు ముఖం చాటేస్తున్నారు. తాజాగా బుధవారం పంచాయతీ కార్యదర్శి కుమారి ఆధ్వర్యంలో మరోసారి డీఎల్‌పీవో మోహనరావు, ఈవోపీఆర్‌డీ ఉమా ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి కేవలం పశుసంవర్ధక శాఖ వైద్యుడు, గోసంరక్షణ ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. సంత యాజమాని తరఫున హాజరైన ప్రతినిధి రమణరాజు వచ్చీ రావడంతోనే అధికారుల తీరుపై మండిపడ్డాడు. ఎన్నాళ్లు మీటింగ్‌లు పెట్టి తమని ఇబ్బందులు పెడతారని ప్రశ్నించాడు. అసలు సంతకు లైసెన్స్ అనే పదం లేదని... దీనికి హడావుడి ఎందుకని నిలదీశాడు. ఇస్తే లైసెన్స్ ఇవ్వండని..లేకపోతే ఇవ్వలేమని కాగితం రాసివ్వండని గద్దించాడు. ఈవోపీఆర్‌డీ సంత బయట తాము శుభ్రం చేయిస్తామని ...లోపల బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయాలని చెప్పగా... తాము ఏడాదికి రూ.1.50లక్షలు చెల్లిస్తున్నామని పంచాయతీ బ్లీచింగ్ చెల్లించలేదా అని ప్రశ్నించారు. దీంతో అధికారులు విస్తుపోయారు. ఈసారి జరిగిన సమావేశంపై జిల్లా అధికారులకు నివేదిక పంపించాలని పంచాయతీ కార్యదర్శిని డీఎల్‌పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గోసంరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విచారణ

అలమండ పశువుల సంతలో 2018నుంచి 2023వరకు ఎటువంటి సౌకర్యాలు లేకుండా లైసెన్స్ ఇచ్చారని, దీనికి అనుమతులు ఇచ్చిన అప్పటి ఈవోపీఆర్‌డీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎర్నమ్మలపై డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. జిల్లా గోసంరక్షణ ప్రతినిధులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో దీనిపై విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఎస్.కోటలో పనిచేస్తున్న ఈవోపీఆర్‌డీ మాట్లాడుతూ తాము సంతలకు ఎటువంటి లైసెన్సు ఇవ్వలేదని తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన వైద్యశిబిరం



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

రాజాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గెడ్డవలస గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారులు నరేంద్ర, సిద్దేశ్వర్‌లు సిబ్బందితో కలసి బుధవారం రెండో రోజు కూడా వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. వేడి నీళ్లు తాగాలని సూచించారు. మురికి కాలువల్లో పూడికలు తొలగించి, ఫాగింగ్ చేయించారు.

విద్యార్థులకు పోటీలు నిర్వహించాలి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారులు దినోత్సవం సందర్భంగా పాఠశాల, కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం జేసీ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 24న పోటీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఎస్‌వో మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు గౌరవమివ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

కొత్తవలస, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్పంచులు, ఎంపీటీసీలకు తగిన గౌరవం ఇవ్వాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.రమణయ్య అధ్యక్షతన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమం విషయాన్ని సర్పంచ్, ఎంపీటీసీల దృష్టిలో తప్పన సరిగా పెట్టాలని తెలిపారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు తగిన గౌరవం ఇవ్వకపోతే తాను స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా వారి పక్షాన పోరాటం చేయవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అక్రమ తవ్వకాలపై అధికారుల కొరడా



ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

రాజాం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చి, ఎలాంటి అక్రమంగా మాంగనీస్ రవాణా చేస్తున్న వారిపై రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. కొన్నేళ్లుగా మాంగనీస్ తవ్వకాలతో రూ.లక్షలు వెనుకేసు కొన్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని రాజాం పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గార్రాజు చీపురుపల్లి ప్రాంతంల అనుమతులు లేకుండా చింతగుంట డిల్లేశ్వరరావు, తోట జోసెఫ్, బూరాడ సురేష్‌లు కొన్నేళ్లుగా మాంగనీస్ తవ్వకాలు చేపడుతున్నారు. అక్రమంగా రవాణా చేస్తూ అడ్డొచ్చిన అధికారుల చేతులు తడుపుతూ రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నారు. ఈ భాగోతంపై ఫిర్యాదులు అందడంతో జిల్లా ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బి.ప్రసాదరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు, గనులు, భూగర్భ శాఖ అధికారులతో పాటు రాజాం రెవెన్యూ యంత్రాంగం బుధవారం ఆకస్మిక దాడులు చేసింది. అధికార యంత్రాంగం చేరుకునే సమయానికి తవ్వకాలు చేపట్టడం, ట్రాక్టర్‌కు లోడ్ చేసి రవాణాకు సిద్ధంగా ఉండడాన్ని అధికారుల బృందం గమనించింది. మాంగనీస్ తవ్వుతున్న పొక్లెయినర్, లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను అధికారులు సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు డి.సతీష్‌కుమార్, సి.ఐ. ఎం.సురేష్‌కుమార్, గనులు, భూగర్భ శాఖ అధికారులు సి.మోహనరావు, డీడీఎస్.రాంబాబు, రెవెన్యూ ఇనస్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే మాంగనీస్ ఖనిజాన్ని ఎవరైనా అక్రమంగా తవ్వడం, రవాణా చేయడం నేరమని ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ప్రసాదరావు తెలిపారు. అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏటీఎం కార్డు మార్చి..రూ.2 లక్షలు మాయం

సంతకవిటి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఏటీఎం ద్వారా రూ.2.17 లక్షలు డ్రా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాజాం మండలం గడ్డిముడిదాం గ్రామానికి చెందిన లావేటి రాజగోపాలనాయుడు బుధవారం సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గడ్డిముడిదాం గ్రామానికి చెందిన లావేటి రాజగోపాలనాయుడుకు తల్లి సూర్యకాంతమ్మ అకౌంట్ నుంచి ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేయాలని ఏటీఎం కార్డు ఇచ్చింది. ఆయన అనారోగ్యంతో బాధ పడుతుండడంతో ఈ నెల 4న అదే గ్రామానికి చెందిన ఏగిరెడ్డి మోహన్‌రావుకు కార్డు ఇచ్చి డబ్బులు తీయాలని సూచించారు. ఏటీఎం కేంద్రంలో మోహన్‌రావు మరో వ్యక్తికి కార్డు ఇచ్చి డబ్బులు తీయాలని కోరారు. ఆ వ్యక్తి రూ.10 వేలు తీసి మోహన్‌రావుకు ఇచ్చాడు. మోహన్‌రావు ఇచ్చిన ఏటీఎం కార్డును మార్చేసి, మరొకటి చేతిలో పెట్టాడు. ఈ నెల 16న మరోసారి డబ్బులు డ్రా చేయడానికి ఏటీఎంకు వెళ్లిన రాజగోపాలనాయుడు అకౌంట్‌లో డబ్బులు లేవని గుర్తించారు. వెంటనే బ్యాంక్ వారిని సంప్రదించగా దఫదఫాలుగా ఏటీఎం ద్వారా రూ.2.17 లక్షలు డ్రా చేసినట్లు సిబ్బంది తెలిపారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజగోపాలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆటో, మోటార్ సైకిల్ ఢీ

కొత్తవలస, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవాడ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలు... రామలింగపురం గ్రామానికి చెందిన సబ్బవరపు అక్కునాయుడు తన మోటార్ సైకిల్‌పై నరపాం గ్రామంలోనున్న బంధువుల ఇంటికి బయలుదేరాడు. దేవాడ సమీపంలోని చెరువు దగ్గర ముందర ఉన్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. దీంతో అక్కునాయుడు కుడి కాలికి తీవ్ర గాయమైంది. బాధితుడిని చికిత్స నిమిత్తం విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లోనున్న పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బొబ్బిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని పాతబొబ్బిలి సమీపంలో ఓ రోడ్డు గుంత మహిళను బలిగొంది. మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమె విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఎస్ఐ రమేష్ కథన మేరకు.. మన్యం జిల్లాలోని సీతానగరం మండలంలోగల చినబోగిలి గ్రామానికి చెందిన దుప్పాడ ఉషారాణి (49) తన కుమారుడు అజయ్‌చంద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై దత్తిరాజేరు మండలంలోని మరడాం గ్రామానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా పాతబొబ్బిలి సమీపంలో రోడ్డుగుంతలో పడి తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఆమెను బొబ్బిలి సీహెచ్‌సీలో చేర్పించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో వియనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఉషారాణి భర్త అప్పయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మాహత్యా యత్నం

బెలగాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలంలోని బాలగుడబలో కుటుంబాల కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని మంగళవారం అర్ధరా త్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఔట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు.. బాలగుడబ గ్రామానికి చెందిన ఆమిటి సతీష్‌కు 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. సతీష్ మద్యా నికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య కలహాలు జరు గుతుండేవి. దీంతో భార్య ఐదేళ్ల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు కబురు చేసినా రాలేదు. మనస్థాపానికి గురైన సతీష్ మంగళవారం అర్ధరాత్రి మేడ మీదకి వెళ్లి పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుమారు 80 శాతం శరీరం కాలిపోయింది. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పార్వతీపురం కోర్టు మెజిస్ట్రేట్ వాగ్మూలం తీసుకున్నారు. వివరాలు నమోదు చేసినట్లు ఔట్‌పోస్టు ఏఎస్ఐ నిమ్మకాయల బాస్కరరావు తెలిపారు.

100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొయ్యకొండవలస గ్రామ పరిదిలో బుధవారం 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు బొబ్బిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయడు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామంలో ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మెట్ట శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు బెల్లం ఊటను ధ్వంసం చేసి అనంతరం చుట్టుపక్కల గ్రామాల్లో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం:ఎమ్మెల్యే



టార్పాలిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. రాకోడులో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టార్పాలిన్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు అందిస్తోందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులతో పాటు రాకోడు టీడీపీ నాయకుడు వేచలపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు పంపిణీ

బెలగాం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ కె.సత్యనారాయణ కుటుంబానికి యాక్సిడెంట్ డెత్ బెనిఫిట్స్ ద్వారా మంజూరైన రూ.75 లక్షల చెక్కును ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అందజేశారు. పాలకొండ పీఎస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన కె.సత్యనారాయణ గతఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సీఐ రంగనాథం, ఆర్ఐలు నాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రికి నిధుల కేటాయింపుపై హర్షం

పార్వతీపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు క్రీడా సామగ్రి సమకూర్చాలని ప్రభుత్వ నిర్ణయించడంపై పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ, మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటినాయుడు, కాగాన విజయ్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గంట శశికుమార్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలకు రూ. ఏడు వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.14 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.30 వేలు చొప్పున నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

సాలూరురూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):సాలూరు మండల సమావేశానికి వైసీపీకి చెందిన ఎంపీపీ రాములమ్మతో సహా ఎంపీటీసీ సభ్యులంతా గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో సమావేశం గురువారానికి వాయిదా వేసినట్లు సాలూరు ఎంపీడీవో ఎ.రమాదేవి ప్రకటించారు. సాలూరు మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరగాల్సిఉంది. సమావేశానికి ఎంపీడీవో రమాదేవి, ఏవో గొల్లపల్లి పార్వతీతోపాటు పలువురు అధికారులు, టీడీపీకి చెందిన ఎంపీటీసీలు అప్పికొండ రమాదేవి, కోటదాలమ్మ, నలుగురు సర్పంచ్‌లు హాజరయ్యారు. ఎంపీపీ రాములమ్మ, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణావతి, వైసీపీకి చెందిన ఎంపీటీసీలు, కొందరు సర్పంచ్‌లు సమావేశానికి రాలేదు. సమావేశ నిర్వహణకు కనీసం సభ్యుల్లో మూడోవంతు ఎంపీటీసీసభ్యులు హాజరుకాకపోవడంతో కోరం లేదని సమావేశాన్ని గురువారానికి ఎంపీడీవో వాయిదావేశారు. కాగా సమావేశానికి ఎందుకు రాలేదో గురువారం వెల్లడిస్తామని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ స్పష్టంచేశారు.

బంగారమ్మతల్లికి వెండి కిరీటం బహూకరణ

సాలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బంగారమ్మకాలనీలో ఉన్న బంగారమ్మ తల్లి అమ్మవారికి అల్లు అప్పలనాయుడు కుటుంబ సభ్యులు సుమారు రెండు కేజీలు వెండి కిరీటాన్ని బుధవారం అమ్మవారికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, వరలక్ష్మి, వెంకటరఘువంశి, మౌనిక పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

గరుగుబిల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈఈ బడే శ్రీనివాసనాయుడు తెలిపారు. బుధవారం గరుగుబిల్లితో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో వారోత్సవాలకు సంబంధించి కరపత్రాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఈ బొంతాడ శంకరరావు, డొంకాడ రాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై...

వీరఘట్టం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని హుస్సేన్‌పురంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రమాదాలు జరిగే సమావేశంలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వామిబాబు, ఉపాధ్యాయులు దన్నాన చంద్రమౌళి, కిమిడి నానిబాబు, కర్రోతు జనార్దనరావు, రంప దివాకర్, జనార్దనరావు, ఊలక ప్రసాద్ పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టడం నేరం

పాలకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెట్టుకుంటే చటరీత్యా నేరమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్‌వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వ్యాపార సముదాయాలు, షాప్‌లను బుధవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 నుంచి 18 సంవత్సరాల్లోపు బాలలను పనిలో పెడితే యజమానులకు అపరాద రుసుంతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ఎం.క్రాంతి, సోషల్ వర్కర్ తోట ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లు సరికాదు

పాలకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు 1/2019 సర్క్యులర్ అమలు చేయకుండా కొంతమంది అధికారులు అక్రమంగా సస్పెన్షన్లు చేయడం తగదని ఆ సంస్థ ఈయూ విజయనగరం జోన్ ఇన్‌చార్జి పి.భానుమూర్తి, జోనల్ అధ్యక్షుడు సుభాకర్, జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విజయనగరంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయ్‌రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు రాము, తాతాలు, పద్మరవణ, నారాయణ, జనార్దన, రాజు, కన్నయ్య, సత్యవతి, లతా, జిల్లా నాయకులు రవికాంత్, శ్రీనివాసమూర్తి, దశరధులు, సుందరరావు,ఎర్రంనాయుడు పాల్గొన్నారు.

ప్రయాణాలు వెళ్తే సమాచారం ఇవ్వండి: ఎస్ఐ

సీతానగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ప్రయాణాలు వెళ్తే పోలీసులకు సమాచారంఇవ్వాలని ఎస్ఐ ఎం.రాజేష్ కోరారు. సీతానగరంలోని గూడెంలో జె.కమలాకర ప్రసాద్‌కు చెందిన కుటుంబసభ్యులు దూరప్రాంతాల్లో ఆరు నెలలుగా నివాసముంటున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి బయట ఉన్న చిల్లర సామగ్రి చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని బుధవారం ఎస్ఐ పరిశీలించారు. ఈమేరకు ముగ్గురుమహిళలు ఇంటి బయట ఉన్న గమేళాలు, ఇనుముతో కూడిన జల్లెడలు, వంటలకు ఉపయోగించే పరికరాలను సంచుల్లో వేసుకుని తరలిస్తుండగా స్థానికులు గుర్తించారని చెప్పారు. ముగ్గురు మహిళలపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థికి ఆర్థిక సాయం

బొబ్బిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సంస్థానం హైస్కూల్ 1988 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు తోటి విద్యార్థికి అండగా నిలిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణానికి చెందిన సంచాన వెంకటరావుకు రూ. 10 వేలు బుధవారం పూర్వవిద్యార్థులు కింతలి బంగార్రాజు, లంక వాసుదేవరావు, రాజకుమార్, శ్రీనివాస్‌లు అందజేశారు.

పథకాలు అర్హులకు అందజేయాలి

బాడంగి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు కోరారు.ఈ మేరకు బుధవారంమండల పరిషత్ అభివృద్ధి అధికారి శంబంగి రామకృష్ణను కలిసి అభివృద్ధి, సంక్షేమ పనులపై చర్చించారు.

నకిలీ పట్టాలపై విచారణ చేయాలి

బొబ్బిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మకాలనీలో జరుగుతున్న నకిలీ ఇళ్ల పట్టాలపై కలెక్టరు విచారణ నిర్వహించాలని సీపీఐ నాయకులు డిమాండ్‌చేశారు. బుధవారం బొబ్బిలిలోని బలిజిపేటరోడ్డులో ఆ పార్టీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యవర్గసభ్యుడు కోట అప్పన్న మాట్లాడుతూ భూకబ్జాలు, నకిలీ పట్టాల తయారీ తదితర నేరాలకు పాల్పడినవారిపై క్రిమినల్ కేసులుపెట్టాలని డిమాండ్‌చేశారు. గతంలో ఈ విషయంపై కలెక్టరేట్‌లో ఫిర్యాదుమేరకు పోలీసు దర్యాప్తునకు కలెక్టరు ఆదేశించినా ఎటువంటి చర్యలు లేవని తెలిపారు. కొంతమంది రాజకీయనాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని పెద్ద భవంతులు నిర్మించి జోరుగా వ్యాపారాలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కబ్జాకు గురైన స్థలాల్లో అధికారులు పెట్టిన బోర్డులను కొంతమంది తొలగించేశారన్నారు.కాలనీలో జరుగుతున్నఅక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీపీఐ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, బాబ్జీ, వెంకటసత్యనారాయణ, సింహాచలం, రాములు పాల్గొన్నారు.

పాలకొండలో రామ్మోహన్‌నాయుడు జన్మదిన వేడుకలు

పాలకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రిలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జన్మదినం పురస్కరించుకుని టీడీపీ మండలాధ్యక్షుడు,తూర్పుకాపు డైరెక్టర్ గండి రామినాయుడు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గండి రవితేజ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పర్యవేక్షణ లేక.. ఇసుక తవ్వకాలు ఆగక

● చోద్యంచూస్తున్న అధికారులు ● ఇదీ ఏడొంపుల గెడ్డ వద్ద పరిస్థితి



ఏడొంపుల గెడ్డలో కెండకుంగువ వద్ద ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్లను సిద్ధంచేసిన దృశ్యం

రామభద్రపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడొంపులగెడ్డ ఆనకట్ట పరిధిలో పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా ఎటువంటి అనుమతిలేకుండా యంత్రాలతో ఇసుక తవ్వి తరలిస్తున్నారు. దీంతో భూగర్భ జలాలపై ప్రభావంపడే అవకాశముందన్న ఆందోళన నెలకొంది. కెండకుంగువ వద్ద ఉన్న ఈ ఆనకట్ట పరిధిలో ఉన్న రెండు కాలువల ద్వారా 500 ఎకరాలు సాగవుతోంది. అయితే ఇక్కడ ఏడొంపుల గెడ్డ నుంచి ఎటువంటి అనుమతిలేకుండా ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. యథేచ్ఛగా ఇసుక తవ్వకాల వల్ల ఆనకట్టకు ప్రమాదం పొంచిఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా గెడ్డపై నిర్మించిన కాజ్‌వే కొట్టుకుపోయే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. ప్రతిరోజూ ఎటువంటి అనుమతిలేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూఅధికారులు చోద్యంచూస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.కాగా రెవెన్యూ అధికారులను ఆ ప్రాంతానికి పంపించి తవ్వకాలు నిలుపుదల చేశామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురంలో గర్భిణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కు పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల వారోత్సవాలు పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జిల్లా కన్స్యూమర్ ఫోరం అధ్యక్షురాలు నాగమణి, ఎంఈవో శేఖర్, డీటీ శేఖర్ పాల్గొన్నారు.

● కప్పకల్లు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు.ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం వినతిపత్రం అందించారు.

●గుమ్మలక్ష్మీపురంలోని గర్భిణుల వసతి గృహాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు.ఈ సందర్భంగా గర్భిణులతో మాట్లాడారు. అనంతరం డార్మెంటరీ, వంటగది పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైటీసీ మేనేజర్, గర్భిణుల వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

● సీతంపేటలో గురుకులాల పొరుగు సేవల సిబ్బంది దీక్షలు



దీక్ష శిబిరం వద్ద పాఠాలను బోధిస్తూ నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సీతంపేట రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా గురుకులాల్లో పొరుగు సేవల ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఉద్యోగులు బి.గణేష్, మోహనరావు తెలిపారు. సీతంపేటలో 28రోజులుగా ఉద్యోగులు చేస్తున్న శాంతియుత దీక్ష శిబిరం వద్ద బుధవారం ఉపాధ్యాయులు వినూత్నంగా నిరసన చేపట్టారు. శిబిరం వద్ద గిరిజన విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఉపాధ్యాయులు భవానీ,భాగ్యలక్ష్మి,రాజేశ్వరీ గౌతమి కోరారు.

విద్యా ప్రమాణాల స్థాయిని పెంచాలి

సీతంపేట రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలస్థాయిని పెంచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డిప్యూటీడీఈవో పి.నారాయడు కోరారు. బుధవారం సవరగొయిదిలోని జీపీఎస్ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఒకటి,రెండు తరగతులకు సంబంధించి అక్షరమాల చార్టులను తరగతి గదిలో ప్రదర్శించాలని తెలిపారు.

బాలికల అభివృద్ధికి కృషి చేయాలి

భామిని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):కిశోరీ బాలికల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రాణి కోరారు.బుధవారం భామిని వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు, డ్రాపౌట్లు లేకుండా చూడాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది శిక్షణ నిర్వహించారు. కిశోరీ బాలికల అభివృద్ధికి ప్రతిజ్ఞచేపట్టారు.కార్యక్రమంలో భామిని అంగన్‌వాడీ పీవో శాంతి భవానీ, రాజ్యలక్ష్మి, ఎంపీడీవో చంద్రరావు, ఎస్ఐ అనిల్‌కుమార్, జ్యోతలక్ష్మి పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు

సాలూరు రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):సాలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఇంధన పొదుపు వారోత్సవాలు పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇంధన పొదుపు వల్ల దేశానికి చేకూరే ప్రయోజనాలు, వ్యక్తిగతం లభించే లబ్ధి తదితర అంశాలపై సాలూరు, పాచిపెంట మండలాల్లోని ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలను సాలూరు ఎంఈవో -2 దాసు, జీజీహెచ్ హెచ్ఎం నెమలిపిట్ట జ్యోతి పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాచిపెంట ఏపీఈపీడీసీఎల్ ఏఈ సింహాచలం, ఉపాధ్యాయులు దివ్వెల చిన్నారావు, ఈదిబిల్లి జానకి,మహాలక్ష్మి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీరు సరికాదు

బలిజిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరైనదికాదని జిల్లా రైతుసంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మీనాయుడు బుధవారం ఒక ప్రకటన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంజాబ్, హర్యానా రైతులు కేంద్ర ప్రభుత్వానికి తమ సమస్యలను చెప్పుకోవడానికి ప్రయత్నిస్తే అడ్డుకోవడం దారుణమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అదాని, అంబానీ తదితర కార్పొరేటర్ సంస్థలకు లక్షలాది కోట్ల రూపాయలు రుణమాఫీ చేస్తోందని ఆరోపించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

కురుపాం, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి):మొండెంఖల్ సమీపంలో బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. తిత్తిరి పంచాయతీ వీఆర్వో చంద్రమౌళి రెవెన్యూ సదస్సులో పాల్గొని మొండెంఖల్ గ్రామానికి అప్లోడ్ నిమిత్తం వచ్చాడు.తిరిగి తన సొంత గ్రామం పీటీమండ బయలుదేరాడు. అదేసమయంలో నీలకంఠాపురం పంచాయతీ మామిడిమానుగూడ గ్రామానికి చెందిన గణపతి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్నాడు. వీరిద్దరు ద్విచక్రవాహనాలు మొండెంఖల్ సమీపంలో ఢీకొన్నాయి. దీంతో గాయపడిన వీరిద్దరిని భద్రగిరి ఆసుపత్రిలో ప్రథమచికిత్స నిర్వహించారు. వీఆర్వో పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాఖ డెయిరీలో అక్రమాలపై నిగ్గు తేల్చాలి



ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

బొబ్బిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ కోరారు. బుధవారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయనను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సహకార రంగంలోఉండే విశాఖ డెయిరీని కంపెనీ చట్టంలోకి మారిన తరువాత అక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆవు పాలధర తగ్గించడంతో పాడి రైతులు నష్టపోతున్నారని చెప్పారు. డెయిరీలోని అక్రమాలపై నియమించిన అసెంబ్లీ హౌస్ కమిటీ సమగ్ర విచారణ జరిపి, కంపెనీ చట్టం నుంచి తిరిగి సహకార రంగంలోకి డెయిరీని తీసుకురావాలని కోరారు.దీనిపై స్పందించిన బేబీనాయన హౌస్ కమిటీ సమష్టిగా విచారణ నిర్వహించి ప్రభుత్వానికి నివేదిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు, పాల రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్ .ఆదినారాయణమూర్తి, , సీఐటీయూ నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గం పరిధిలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను బొబ్బిలికోటలో ఎమ్మెల్యే బేబీనాయన అందజేశారు. బొబ్బిలికి చెందిన పిన్నింటి బ్రహ్మాజీకి రూ.1,84,579లు, మండలంలోని కోమటిపల్లికి చెందిన ఆవాల మోహనసాయికృష్ణకు రూ.38,620లు, రామభద్రపురం మండలంలోని కొండకెంగువకు చెందిన కత్తుల మహేశ్‌కు రూ. 45 వేలు, తెర్లాం మండలం బూరిపేట గ్రామానికి చెందిన బి.ఆర్యవర్ధన్‌కు రూ.25 వేలు చొప్పున చెక్కులను బేబీనాయన అందజేశారు.

● తెర్లాం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విజయరాంపరానికి చెందిన బొమ్మలాట పాపారావు కుమారుడి ఆరోగ్యంబాగోలేకపోవడంతో బేబినాయనా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పొంద్రంకి సత్యం, బూరి రామకృష్ణ, చంద్రునాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి: డీఎంహెచ్‌వో



రికార్డులు పరిశీలిస్తున్న విజయపార్వతి

పాలకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి కోరారు. బుధవారం మండలంలోని ఎం.సింగుపురం పీహెచ్‌సీని తనిఖీచేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, పనితీరుపై ఆరాతీసి రోగుల ఆరోగ్య తనిఖీ వివరాలు ఓపీ రికార్డులు, ఐఎల్ఆర్, బ్యాటరీ పనితీరు , అత్యవసర మందులు, కుక్క, పాముకాటు ఇంజక్షన్ల లభ్యత, కాన్పులు రిజిస్టర్, వార్డు, ల్యాబ్, లేబర్ రూము పరిశీలించారు. వాక్సిన్ నిల్వలు పరిశీలించి టీకా కార్య క్రమం నిర్వహణ తీరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవికుమార్, యోగేశ్వరరెడ్డి, ఈవో రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పనితీరు మెరుగు పరచుకోవాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు పనితీరు మెరుగుపరచుకొని బాధ్యతాయుతంగా పనిచేయాలనితహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్ఐ రాంకుమార్ పాల్గొన్నారు.

మామిడి పంటకు బీమా సదుపాయం

రామభద్రపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మామిడిపంటకు కల్పిస్తున్న బీమా సదుపాయాన్ని రైతులు వినియోగించుకోవాలని, ఈనెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలని స్థానిక ఉద్యానశాఖాధి కారి పి.మోహనకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని ఆరికతోటలో మామిడి రైతులతో మాట్లాడుతూ ఎకరా మామిడి పంటకు రూ.2వేలు ప్రీమియం చెల్లిస్తే రూ.40వేల వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు. కాగా ఆరికతోటలో పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు ఎల్.శ్యామావతి, వీహెచ్ఏ సంధ్యారాణి పాల్గొన్నారు.

సైనికుల కుటుంబాలకు సహకరిస్తాం



సైనికుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

బాడంగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్మీలో విధులు నిర్వహిస్తూ వీరమరణంపొందిన సైనికుల కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు ప్రభుత్వం తరపున అందజేస్తామని రాజ్యసైనిక సంక్షేమ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి (రిటైర్డ్) వీఎస్ఎం తెలిపారు. బుధవారం విజయనగరంలోని సైనిక సంక్షేమ కార్యాలయంలో వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బాడంగి మండలంలోని బొత్సవానివలస గ్రామానికి చెందిన అమర జవానుసీఎఫ్ఎన్ గొట్టాపు శంకరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈమేరకు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేతులమీదుగా వీరజవాన్ భార్యకు రూ.50వేలు, ఆయన తల్లిదండ్రులకు రూ.50వేలు చొపేన సాయుధ దళాల నిధుల నుంచి సైనిక సంక్షేమశాఖ తరపున చెక్ రూపంలో ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు, మాజీ జిల్లా సైనిక సంక్షేమ అధ్యక్షులు సబ్బన సతీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ జి.రమేష్ పాల్గొన్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండండి

● ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్ కమాండర్ ప్రభిన్ పుకాన్



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

జియ్యమ్మవలస, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించే సమయంలో జరిగే ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృంద కమాండర్ ప్రభిన్ పుకాన్ తెలిపారు. బుధవారం చినమేరంగి గ్రామ సమీపంలో గల స్వామినాయుడు చెరువులో పదో బెటాలియన్ కమాండర్ వీవీఎన్ ప్రసన్నకుమార్, కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విపత్తులసమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహనకల్పించింది. ఈసందర్భంగా కమాండర్ ప్రభిన్ పుకార్ మాట్లాడుతూ కోస్తా తీర మండలాల్లో గల గ్రామాలు, పాఠశాలలు, పరిశ్రమల్లో అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం హెచ్‌సీ ఎన్.రామారావు, ఫైర్ స్టేషన్ ఎస్ఐ బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

పన్ను బకాయిల వసూలుకు కసరత్తు

బొబ్బిలి డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీపరిధిలో కొళాయి పన్నుల బకాయిలు పేరుకుపోవడంతో వాటి వసూళ్ల కోసం అధికారులు కసరత్తు చేపట్టారు. ఈమేరకు బకాయిదారులపైకొరడా ఝుళిపిస్తున్నారు. 1.13 కోట్ల రూపాయల కొళాయి పన్ను డిమాండ్ కాగా ఇంతవరకు 31.64 లక్షల రూపాయలు మాత్రమే వసూలైందని, బకాయిల వసూళ్లకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు పదివేల రూపాయలకు పైగా బకాయిలు ఉన్న వారి ఇళ్లకు కొళాయి కనెక్షన్లను తొలగించే ప్రక్రియను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ మేరకు బుధవారం మహారాణిపేట, దావాలవీధి, రావువారివీధుల్లో మూడు కొళాయి కనెక్షన్లను తొలగించినట్లు తెలిపారు. బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

ఉత్తమ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా తిరుపతిరావు

జియ్యమ్మవలస, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీవీ తిరుపతిరావును ఎంపిక చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. డీజీపీ కమెండేషన్స్ డిస్క్-22 బ్రాంజ్ మెడల్‌ను ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి చేతులమీదుగా అందుకున్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

పాచిపెంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఐదు నెలల వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరాడఈశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కర్రివలస పాఠశాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా ఐదో తేదీలోగా వేతనాలు చెల్లించాలన్న నిబంధనలుఉన్నా జాప్యం చేస్తున్నారని వాపోయారు. చాలీచాలని రూ.మూడు వేలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని తెలిపారు. మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా ప్రభుత్వరంగ సంస్థలతో కొనసాగించాలని కోరారు. సమావేశంలో బి.రాములమ్మ, ఇ.సరస్వతి, సింహాచలం పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక

పాలకొండ/పార్వతీపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడిప్లస్, ఎయిర్‌టెల్ పేమెంట్, భారత్‌పే కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 53 మంది నిరుద్యోగులు పాల్గొనగా 18 మంది ఎంపికయ్యారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయమణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాజు, అధ్యాపకులు పి.రాజ్యలక్ష్మి, ఎం.శాంతి,కూన శ్రీనివాసరావు, రాఘవేంద్రనాయుడు, ఆమంచి శ్రీనివాసరావు, వి.జనార్దనరావు పాల్గొన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం

బలిజిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బలిజిపేటలో రైస్ మిల్లుల అసోసియేషన్, హమాలీలకు మధ్యవేతన ఒప్పందం జరిగింది. బుధవారం సీఐటీయూ ఆధ్వ ర్యంలో రైస్‌మిల్ అసోసియేషన్ మండలాధ్య క్షుడు కొత్తకోట రమేష్, సాయిరాం, రఘు, శేఖ ర్, హమాలీల యూనియన్ అధ్యక్షుడు పోలీల అప్పారావు సమావేశం నిర్వహించారు.ఈమేరకు బుధవారం యజమాన్యాలకు, యూనియన్ మధ్య జరిగిన చర్చల్లో 12శాతం పీస్ రేటు పెంచడానికి అంగీకారంకుదిరింది. కార్యక్రమంలో రైస్‌మిల్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు కొత్తకోట రమేష్, సాయిరాం,రఘు,శేఖర్, యూనియన్ అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎంఎంటీసీ డైరెక్టర్ , ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీజేపీ నాయకులు శ్రీనివాసరావు కోరారు. స్థానిక గిరిజన గురుకుల కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడారు.

దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తాం

రామభద్రపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్నామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. బుధవారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ వివిధ సమస్యలపై రైతుల నుంచి ఇప్పటివరకు 130 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిలో ఎక్కువగా గత రీసర్వేలో వచ్చిన సమస్యలపైనే దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

వంద రోజులు పని కల్పించాలి

బాడంగి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వేతనదారులకు వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. బుధవారం బాడంగిలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా గోకులాల నిర్మాణాలు, వేతనదారులకు సరాసరి వేతనం పెంచడం, అమృత సరోవర్ ట్యాంక్స్ గుర్తింపు, క్లోజర్ ఆఫ్ వర్క్స్‌పై చర్చించారు.

22 పంచాయతీల్లో అభివృద్ధి పనులు

రామభద్రపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 పంచాయతీల్లో రూ.5 కోట్ల 11 లక్షలతో 80 అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఉపాధిహామీ పథకం ఏపీవో గొలగాని త్రినాధరావు తెలిపారు. బుధవారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ నెలాఖరులోగా పనులు పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 135 ఫారంపాండ్స్ పనులు చేయడానికి ప్రతిపాదనలు పంపించామని, 72 గోకులాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు.